RNI NO.APTEL/2013/49614

**విలేకరులు కావలెను**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సర్క్యులేషన్ కలదుతూ ఆంధ్రప్రజలందరి మన్ననను పొందుతున్న రాజనీతి దినపత్రికకు జిల్లా వ్యాప్తంగా విలేకరులు కావలెను.

ఇతర వివరాలకు వెంటనే సంప్రదించండి:

కాకర్ల పద్మజ చీఫ్ ఎడిటర్
మొబైల్: 9618501530

శ్రీమతి కాకర్ల పద్మజ ప్రధాన సంపాదకత్వంలో

# రాజనీతి

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 13 | సంచిక : 158 | అన్నమయ్య జిల్లా | చీఫ్ ఎడిటర్ : కాకర్ల పద్మజ | గురువారం 18 జూన్ 2026 | పేజీలు : 04 | వెల : రూ. 2/-

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని ఇంటికి పవన్ కళ్యాణ్

**–లక్ష ఆర్థిక సాయం, వెండి ప్రతిమ బహూకరణ**

హనుమకొండ, జూన్ 17: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన జన్యుపరమైన డీఎండీ (ఇవీణ) వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన 17 ఏళ్ల తన యువ అభిమాని నిరంజన్ చిరకాల కోరికను ఆయన తీర్చారు. బుధవారం స్వయంగా హనుమకొండలోని హనుమాన్ నగర్‌లో ఉన్న నిరంజన్ నివాసానికి పవన్ కళ్యాణ్ వెళ్లి పరామర్శించారు. ఇంట్లోకి వెళ్లిన పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో మంచంపై ఉన్న నిరంజన్‌ను చూసి తీవ్రంగా చలించిపోయారు. నిరంజన్ పక్కన కూర్చుని ఆప్యాయంగా హత్తుకుని, నుదుటిపై ముద్దు పెట్టి పలకరించారు. "చిన్నప్పటి నుంచి మీరంటే నాకు చాలా అభిమానం" అని నిరంజన్ చెప్పిన మాటలకు పవన్ భావోద్వేగానికి గురయ్యారు. నిరంజన్ గతంలో ఆరోగ్యంగా ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ పాటలకు వేసిన డ్యాన్స్ వీడియోలను ఈ సందర్భంగా ఆయన ఆసక్తిగా తిలకించారు. తనను అంతా "ఛోటా గబ్బర్ సింగ్" అని పిలుస్తారని నిరంజన్ పవన్‌కు వివరించాడు. నిరంజన్ తల్లిదండ్రులు పొనుగోటి రంగారావు, మానసలతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని, వైద్య వివరాలను పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ. 1 లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం నుండి ప్రత్యేకంగా తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు కప్పి, కళ్యాణ అక్షతలు, తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.నిరంజన్ ఆరోగ్యం కుదుటపడాలని వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తానని పవన్ హామీ ఇచ్చారు. అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజలు చేయించి నిరంజన్ కుటుంబ సభ్యులకు అందజేస్తామని చెప్పారు. నిరంజన్ తండ్రి గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పనిచేసిన అనుభవాన్ని గుర్తించి, వారి



కుటుంబ జీవనోపాధి మెరుగుపడేందుకు ఒక క్యాంటీన్ ఏర్పాటు చేయించాలని జనసేన తెలంగాణ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఒక కుక్క పిల్లను పెంచుకోవాలన్న నిరంజన్ కోరిక మేరకు, దానిని కొని పంపిస్తానని హామీ ఇస్తూ ఇంటి ఓనర్లతో స్వయంగా మాట్లాడారు. ఈ పరామర్శ అనంతరం పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట జనసేన తెలంగాణ ఇంచార్జ్ శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి తదితరులు ఉన్నారు.

## ఆరుట్ల పబ్లిక్ స్కూల్ తెలంగాణకు ఆదర్శం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



రంగారెడ్డి : ప్రభుత్వ పాఠశాలలంటే కేవలం పేదలు, అనాథలు మాత్రమే చదువుకునే విద్యాసంస్థలనే పాత అభిప్రాయాన్ని పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామంలో అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ పాఠశాల రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యకు ఒక గొప్ప ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఇదే సందర్భంలో విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించే సరికొత్త పథకానికి కూడా సీఎం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఈ ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఒక పెద్ద స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సర్కారు బడుల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కాగలరనే నమ్మకాన్ని సమాజంలో పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం పెద్ద పెద్ద భవనాలు, రహదారులు నిర్మించడం మాత్రమే కాదని, దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని సీఎం వ్యాఖ్యానించారు. విద్యపై పెట్టే ఖర్చును తాము భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని, అందుకే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి దాదాపు రూ.26 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఆరుట్ల పబ్లిక్ స్కూల్‌లో ప్రీ–ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు రికార్డు స్థాయిలో 1,814 మంది విద్యార్థులు చేరడం పట్ల ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలో సీట్లు పూర్తిగా నిండిపోయి, కొత్త అడ్మిషన్లకు అవకాశం లేకపోవడమే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు ఇప్పటికే 'స్కిల్ యూనివర్సిటీ'ని ప్రారంభించామని, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసేందుకు త్వరలోనే 'స్పోర్ట్స్ యూనివర్సి'ని కూడా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. అలాగే సమాజానికి ముప్పుగా మారిన మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యూనిఫాంలు, షూస్, సాక్స్, బ్యాగులు మరియు ఇతర విద్యా సాగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జూలై చివరి వారం నుండి ఈ విద్యా కిట్ల పంపిణీ అధికారికంగా ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, ఆరుట్ల పబ్లిక్ స్కూల్ రాష్ట్ర విద్యా వ్యవస్థకు ఒక కొత్త దిశానిర్దేశం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## కడపలో ఘనంగా ప్రారంభమైన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

**–వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం వేదికగా జూన్ 21 వరకు మ్యాచ్‌లు**

**–టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించిన స్టేడియం చైర్మన్ ఆర్. శ్రావణ్ రాజ్ రెడ్డి**

కడప, జూన్ 17: కడప నగరంలోని వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం వేదికగా ప్రతిష్టాత్మక ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. జూన్ 17 నుండి జూన్ 21 వరకు ఐదు రోజుల పాటు ఈ క్రీడా సంబరాలు జరగనున్నాయి. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకల్లో వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం చైర్మన్ శ్రీ రెడ్డెప్పగారి శ్రావణ్ రాజ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, టాస్ వేసి మ్యాచ్‌లను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. స్థానిక క్రీడాకారులలోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడానికి, కడప జిల్లాలో క్రీడా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇలాంటి భారీ స్థాయి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. నగరంలోని క్రికెట్



అభిమానులు, యువత, క్రీడా ప్రేమికులు పెద్ద సంఖ్యలో విచ్చేసి మ్యాచ్‌లను వీక్షించి, ఆటగాళ్లను ప్రోత్సహించడం ద్వారా ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు.

## కాజ ఈస్ట్ లేక్ పార్క్ ప్రారంభం

**–రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి**

**–కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి లోకేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**–ప్రజలకు అందుబాటులోకి సరికొత్త విహార కేంద్రం**



మంగళగిరి, జూన్ 17: మంగళగిరి మండలం కాజ గ్రామంలోని ఉప్పలపాడు–నంబూరు–కాజ రహదారి మార్గంలో ఆధునిక హంగులతో నిర్మించిన 'కాజ ఈస్ట్ లేక్ పార్క్'ను రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పార్కులో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 'సెల్‌కాన్' సంస్థ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద రూ.3.3 కోట్ల వ్యయంతో ఈ పార్కును సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసింది. సుమారు 17.18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఆధునిక సౌకర్యాలతో ఈ పార్కును తీర్చిదిద్దారు. ప్రజలు సేదతీరేందుకు వీలుగా నడక దారులు (వాకింగ్ ట్రాక్స్), విశ్రాంతి ప్రదేశాలు, ఆహ్లాదకరమైన పచ్చదనం, ఆకర్షణీయమైన అలంకరణలను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు వినోద, విహార సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ఉపయోగకరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఇలాంటి ప్రాజెక్టులు సమాజానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కాజ ఈస్ట్ లేక్ పార్క్ ప్రారంభంతో మంగళగిరి పరిసర ప్రాంత ప్రజలకు మరో ఆకర్షణీయమైన విహార కేంద్రం అందుబాటులోకి వచ్చిందని, ఇది స్థానికులతో పాటు సందర్శకులను సైతం విశేషంగా ఆకట్టుకుంటుందని అధికారులు భావిస్తున్నారు.




ఫ్రాన్స్, జూన్ 17: ఫ్రాన్స్ దేశం ఆతిథ్యమిచ్చిన ప్రతిష్టాత్మక 52వ జీ7 అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు బుధవారం ఘనంగా ముగిసింది. ప్రపంచ దేశాల మధ్య అనేక కీలక రాజకీయ, ఆర్థిక, రక్షణ అంశాలపై చర్చలకు వేదికైన ఈ సదస్సుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లతో పాటు ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, జర్మనీ, కెనడా, యూకే మరియు యూరోపియన్ యూనియన్ దేశాల అధినేతలు, ప్రధాన మంత్రులు హాజరయ్యారు. సదస్సు ముగింపు సందర్భంగా +7 కూటమి ఒక ఉమ్మడి జాయింట్ డిక్లరేషన్‌ను విడుదల చేసింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలతో పాటు ఉక్రెయిన్–రష్యా యుద్ధం గురించి ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ఉక్రెయిన్ సార్వభౌమాధికారానికి తమ తిరుగులేని మద్దతు ఉంటుందని +7 స్పష్టం చేసింది. తూర్పు ఐరోపా ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పడానికి దేనికైనా సిద్ధమని అగ్రదేశాలు ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేశాయి. ఉక్రెయిన్ పౌరులకు రక్షణ కల్పించడంతో పాటు, ఆ దేశ భద్రతా దళాలను బలోపేతం చేసేందుకు ఆర్థిక, సైనిక వ్యూహాలను నిరంతరం అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వైమానిక దాడులను తిప్పికొట్టే అధునాతన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, లాంగ్ రేంజ్ క్షిపణులు, ఇంటర్‌సెప్టర్లను తక్షణమే ఉక్రెయిన్‌కు అందజేయాలని మరియు ఉక్రెయిన్ సొంతంగా ఆయుధాల తయారీని పెంపొందించుకునేలా లైసెన్సింగ్ ప్రక్రియలను సులభతరం చేయాలని తీర్మానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో బలపడిన తాజా 'అమెరికా–ఇరాన్' ద్వైపాక్షిక అవగాహన ఒప్పందాన్ని **G7** దేశాలు మనస్ఫూర్తిగా బలపరిచాయి. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా నియంత్రించడానికి, మధ్యప్రాచ్య ప్రాంతంలో తలెత్తే తీవ్ర అస్థిరతను అడ్డుకోవడానికి ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగు అని కొనియాడారు. శాంతి స్థాపన దిశగా ఈ రెండు ప్రత్యర్థి దేశాలు త్వరలోనే స్విట్జర్లాండ్‌లో ఒక అధికారిక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. అలాగే, హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకలు నిరంతరాయంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, గ్లోబల్ ఎనర్జీ సప్లై మార్గాలను వైవిధ్యభరితం చేయాలని +7 నాయకులు నిర్ణయించారు.మధ్యప్రాచ్యంలో నెలకొన్న తాజా మానవతా సంక్షోభాన్ని నివారించేందుకు +7 కూటమి పలు సూచనలు చేసింది. ముఖ్యంగా లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గడానికి తక్షణమే కఠినమైన కాల్పుల విరమణ అమలు కావాలని కోరింది. హిజ్బుల్లా బలగాల నిరాయుధీకరణకు లెబనాన్ నాయకత్వం చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు ప్రకటించింది. గాజా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాల్లో వినాశకర ఘర్షణలకు స్వస్తి పలికి, అక్కడ తక్షణ మానవతా సాయం, పునర్నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని అభిప్రాయపడ్డారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో కూడా అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం శాంతిభద్రతలను పరిరక్షించాలని పేర్కొంటూ.. తూర్పు, దక్షిణ చైనా సముద్రాలతో పాటు తైవాన్ జలసంధి పరిధిలో యథాతథ స్థితిని బలోపేతం చేయడానికి సంఘటిత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఉత్తర కొరియా కొనసాగిస్తున్న అక్రమ అణు, బాలిస్టిక్ క్షిపణి ప్రాజెక్టుల విస్తరణ పట్ల +7 నాయకత్వం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది.

రాజనీతి
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 18 జూన్ 2026

## కూటమి ప్రభుత్వ 2 ఏళ్ల విజయోత్సవ సభకు బీటెక్ రవి పిలుపు


పులివెందుల జూన్ 17 రాజనీతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కడప జిల్లా స్థాయి విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి 'బీటెక్ రవి' ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం 10:00 గంటలకు కడప నగరంలోని బిల్డప్ సర్కిల్ వద్ద ఉన్న పుత్త ఎస్టేట్‌లో జరగనున్న కడప జిల్లా స్థాయి విజయోత్సవ సభలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు,కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో చూపిన చిత్తశుద్ధికి గుర్తుగా ఈ విజయోత్సవ సభను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలి: వైఎస్సార్సీపీ నేతలు



పులివెందుల (రాజనీతి), జూన్ 17: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 119వ పోలింగ్ బూత్‌లో బుధవారం మూడవరోజు ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమం ముమ్మరంగా సాగింది. వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ (దీూా) పూజారి నవీన్, పటాబీ, జయప్రకాష్, సోమన్న మరియు స్థానికుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడమే వైఎస్సార్సీపీ ముఖ్య లక్ష్యమన్నారు. బూత్ లెవెల్ అధికారులు (దీూా) ఇంటింటికీ వచ్చినప్పుడు, జాబితాలో ఓట్లు లేని అర్హులైన వారి వివరాలను సేకరించి కొత్తగా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఓటరుకు ఫామ్స్ అందజేస్తున్నామని, నమోదు ప్రక్రియ కోసం ప్రతి ఒక్కరూ తమ ఫోటోను ఖచ్చితంగా సమర్పించాలని కోరారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ కొత్తగా ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకు పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేస్తున్నాయని వారు స్పష్టం చేశారు.

## కరుణించి కాపాడు హరిహరపుత్ర అయ్యప్ప: ఆలయంలో పంచామృతాభిషేకాలు



పులివెందుల (రాజనీతి), జూన్ 17: పులివెందుల పట్టణ పరిధిలోని పార్నపల్లి రోడ్డు, కోతి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, బిల్వ అర్చన, అష్టోత్తర శతనామావళి తదితర ప్రత్యేక పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరిగాయి. పూజల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామివారి ఆశీస్సులతో కేవలం కార్తీక మాసంలోనే కాకుండా, ఏడాది పొడవునా ప్రతి నిత్యం, ప్రత్యేకంగా ప్రతి బుధవారం రోజులలో స్వామివారికి విశేష పూజలు, ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి మాసంలోనూ అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంకాల సమయాన భక్తుల ఆధ్వర్యంలో మణికంఠుని భజన కార్యక్రమాలు నయనానందకరంగా సాగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు, విచ్చేసిన భక్తులకు పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్, ఎస్పీ, సీఎమ్ఓ కార్యాలయ అధికారులతో కలిసి సభాస్థలి, ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే షాజహాన్ భాష.

– జిల్లా కలెక్టర్, ఎస్పీ, సీఎమ్ఓ కార్యాలయ అధికారులతో కలిసి సభాస్థలి, ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే షాజహాన్ భాష.



మదనపల్లె రాజనీతి: శనివారం మదనపల్లి పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో లబ్ధిదారుల ఇంటిని, నెహ్రూ మున్సిపల్ స్కూల్ సమీపంలోని అంగన్వాడి కేంద్రాన్ని, బెంగళూరు రోడ్ నందు పార్కింగ్ ప్రాంతం తో పాటు జల ధారా కార్యక్రమంలో పాల్గొనున్న వెంకటమ్మ చెరువు, కదిరమ్మ చెరువు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సీఎమ్ఓ కార్యాలయ అధికారి ప్రహల్లాద ఐఏఎస్ లతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్ భాష పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 20న మదనపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిచున్న నేపథ్యంలో ఏర్పాట్లును పరిశీలించి, కార్యక్రమాల నిర్వహణ పట్ల అధికారులతో సమీక్షించడం జరిగిందని. సభా వేదిక, ప్రజాదర్బార్, ఇతర కార్యక్రమాల ప్రాంతాలను క్షుణంగా పరిశీలించడం జరిగిందని ఈ సాయంత్రం, జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను ప్రకటిస్తారని తెలిపారు.. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున తరలి రావాలని, మహిళలు, రైతులు విద్యార్థులు తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ.ఈ అరవింద దేవి, ఏపీ ట్రాన్స్కో డి ఈ గంగాధర్, పంచాయతీరాజ్ ఈఈ, వెలుగు పిడి, ఐసిడిఎస్ పిడి, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పటాన్ ఖాదర్ ఖాన్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ శంకర్ నాయుడు, శ్యామలమ్మ, నవీన్ చౌదరి, బాలు స్వామి, శ్రీకాంత్ రెడ్డి, జెసిబి వేణు, సురేందర్ రెడ్డి, చిప్పిలి గురునాథ్, ఆదిల్, ఆర్ఎస్ సంషీర్, తదితరులు పాల్గొన్నారు..

# మదనపల్లెకు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

– ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి : ఎస్. నిసార్ అహమద్



మదనపల్లె రాజనీతి: 2024 ఎన్నికల సందర్భంగా మదనపల్లె ప్రజలకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా వాటి అమలుపై ఎలాంటి పురోగతి కనిపించడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ తీవ్రంగా ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజల ఆశలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆయన పేర్కొన్నారు . 20వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి మదనపల్లెకు విచ్చేయనున్న సందర్భంగా మదనపల్లెలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్. నిసార్ అహమద్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచార సమయంలో మదనపల్లె అభివృద్ధికి సంబంధించి టీడీపీ అధినేత శ్రీ చంద్రబాబు నాయుడు అనేక కీలక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వాటిలో ముఖ్యంగా స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు, టమోటా రైతులకు మేలు చేసే విధంగా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, హంద్రీనీవా ద్వారా సాగు మరియు తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం, పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మౌలిక వసతుల అభివృద్ధి, మదనపల్లె--రామసముద్రం--నిమ్మనపల్లి రహదారుల విస్తరణ వంటి అంశాలపై ప్రజలకు హామీలు ఇచ్చారని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై ఎలాంటి చర్యలు కనిపించడం లేదని, మదనపల్లె అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారని ఆయన విమర్శించారు. రైతులు, నిరుద్యోగ యువత, సాధారణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మాజీ మునిసిపల్ చైర్మన్ వి . మనూజా రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలను మరచిపోయి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. వై ఎస్ ఆర్ సి పి మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి .యస్ . రెడ్డి మాట్లాడుతూ మదనపల్లె ప్రజలు ఆశించిన అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సాగు మరియు తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మదనపల్లె ప్రజలు అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. మాజీకౌన్సిలర్ గుండ్లూరు రఫీ మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణలో చూపించాలని సూచించారు. లేకపోతే ప్రజలు తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ మనుజా రెడ్డి, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎన్. ఇర్ఫాన్, గుండ్లూరి రఫీ, ఈశ్వర్ నాయక్, శ్రీనివాసులు, రహీం, నాయకులు యూనస్, బయ్యా రెడ్డి, నరసింహులు, అనిల్ కుమార్ రెడ్డి, మధు, వడిగల శ్రీకాంత్, చెన్నకృష్ణ, శారదా రెడ్డి, నాగమణి, అమ్మాజాన్, జిక్రి, మాలెపాడు చలపతి, భాను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి చాటిన మాజీ సర్పంచ్ కుటుంబం: సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి రూ.65 వేల వెండి వేలాయుధం బహూకరణ



వేంపల్లె (రాజనీతి), జూన్ 17: వేంపల్లె పట్టణంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిపై ఉన్న భక్తిశ్రద్ధలను చాటుకుంటూ స్థానిక మాజీ సర్పంచ్ రాయవరం రామలింగయ్య కుటుంబ సభ్యులు ఆలయానికి ఒక విలువైన కానుకను సమర్పించారు. సుమారు రూ.65 వేల విలువ చేసే వెండి వేలాయుధాన్ని స్వామివారికి బహూకరించి తమ ఆధ్యాత్మిక సేవాభావాన్ని చాటుకున్నారు. బుధవారం రామలింగయ్య కుటుంబ సభ్యులైన సతీమణి నాగలక్ష్మి, కుమారుడు శరత్ బాబు, కోడలు లక్ష్మీ, కుమార్తెలు రేష్మా, సుష్మా, మనవళ్లు సాయి గణేష్, గంగాధర్ అందరూ కలిసి ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరిరావుకు ఈ వెండి వేలాయుధాన్ని ఘనంగా అందజేశారు. ఈ కానుక సమర్పణకు ముందుగా ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి పంచామృతాభిషేకం, మంత్రపుష్పం, మహా మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అధికారులు దాత కుటుంబ సభ్యులను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. భక్తులు స్వామివారిపై భక్తితో ఆలయ అభివృద్ధికి అందిస్తున్న ఇలాంటి సహకారం ఎంతో అభినందనీయమని, ఈ విధమైన సేవా కార్యక్రమాలు మిగతా భక్తులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి సాంబశివుడు, బీజేపీ నాయకుడు గాలి హరిప్రసాద్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మురికి రాజేష్, కామిశెట్టి సురేష్ బాబు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ నేత పేర్ల పార్థసారధి రెడ్డి

వేముల (రాజనీతి), జూన్ 17: వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లి మండలం గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మల్లంగి సుధాకర్ రెడ్డి కుమారుని వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి మరియు పేర్ల శేషారెడ్డిలతో పాటు వేంపల్లి మండల టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ వేదికపై నూతన వధూవరులను వారు ప్రత్యేకంగా అభినందించారు. వివాహ బంధం అనేది జీవితంలో అత్యంత పవిత్రమైనదని తెలియజేస్తూ.. నూతన దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, పచ్చని సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అనంతరం కల్యాణ మంటపంలో జరిగిన వివాహ వేడుకల్లో భాగంగా అక్కడికి విచ్చేసిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఆత్మీయులు పేర్ల బ్రదర్స్‌ను ఆప్యాయంగా పలకరించారు. వారందరితో కలిసి వీరు కొంత సమయం వివాహ వేడుకలలో ఆనందంగా గడిపారు. ఈ శుభకార్యంలో వధూవరుల బంధుమిత్రులు, నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలు మరియు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# పీలేరు అర్బన్ సీఐగా జి. వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం



పీలేరు ,రాజనీతి, అర్బన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా జి. వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనంతపురం మహిళా పోలీస్ స్టేషన్లో సీఐగా పనిచేసిన ఆయన, యుగంధర్ బదిలీ నేపథ్యంలో పీలేరుకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం



సోమల, రాజనీతి: వల్లిగట్ల పోలింగ్ బూత్ 135 నందు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు విశ్వనాథం మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరు **SIR** ఓటరు సర్వే చేపించు కొని తమ ఓటును ధృవీకరించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీూా వినయ్ కుమార్ మరియు దీూా పర్వతాల సుబ్బరాయుడు మరియు టిడిపి నాయకులు విశ్వనాథం కదిరప్ప శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్



వాల్మీకిపురం, రాజనీతి: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ అండర్–16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా రెండో రౌండ్ మ్యాచ్‌లు గురువారం (జూన్ 18) నుంచి వాల్మీకిపురంలోని సిడిసిఏ––జీవీఎస్సిఎస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ హెడ్ కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడానికి ఈ టోర్నమెంట్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన అండర్–16 క్రికెటర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, మ్యాచ్‌లు అత్యంత పోటీతత్వ వాతావరణంలో సాగనున్నాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లలో గ్రౌండ్–ఏ లో నెల్లూరు జిల్లా జట్టు మరియు కడప జిల్లా జట్టు తలపడనున్నాయి. అదే సమయంలో గ్రౌండ్–బి లో చిత్తూరు జిల్లా జట్టు మరియు కర్నూలు జిల్లా జట్టు మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే అవకాశం లభించడంతో పాటు, భవిష్యత్తులో రాష్ట్ర మరియు జాతీయ స్థాయి జట్లకు ఎంపికయ్యే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అన్నారు. క్రీడాభిమానులు, తల్లిదండ్రులు మరియు స్థానిక క్రికెట్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరై యువ ఆటగాళ్లను ప్రోత్సహించాలని సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు

# వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే: స్పెయిన్‌ను అద్భుతంగా అడ్డుకున్న 40 ఏళ్ల కేప్ వెర్డ్ గోల్‌కీపర్ వోజిన్హా



అట్లాంటా (రాజనీతి), జూన్ 17: ఫిఫా వరల్డ్ కప్ 2026లో కేప్ వెర్డ్ దేశపు గోల్‌కీపర్ జోసిమార్ జోస్ ఎవోరా డయాస్ (వోజిన్హా) సరికొత్త చరిత్ర సృష్టించాడు. 40 ఏళ్ల వయసులో పగటిపూట జీవనం కోసం బస్ డ్రైవర్‌గా, ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ, రాత్రి సమయంలో ఫుట్‌బాల్‌పై తన అంతులేని ఇష్టాన్ని వెంబడిస్తున్న ఈ రియల్ హీరో.. బలమైన స్పెయిన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. గ్రూప్ హెచ్‌లోని తొలి మ్యాచ్‌లో యూరప్ ఛాంపియన్‌లైన స్పెయిన్ జట్టును కేప్ వెర్డ్ 0–0 గోల్స్ తేడాతో డ్రాగా నిలువరించింది. ఈ చారిత్రాత్మక మ్యాచ్‌లో వోజిన్హా ఏడు కీలక సేవింగులు చేసి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. స్పెయిన్ జట్టు ఏకంగా 74 శాతం పొసెసన్‌తో (బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని) 27 సార్లు గోల్ కోసం షాట్లు కొట్టినా, వోజిన్హా కొండలా అడ్డుపడి గోల్‌పోస్టులను కాపాడాడు. తద్వారా తన దేశానికి వరల్డ్ కప్‌లో ఒక చారిత్రాత్మక పాయింట్ సాధించి పెట్టాడు. కేప్ వెర్డ్‌లోని సావ్ విసెంట్ ప్రాంతానికి చెందిన వోజిన్హా చిన్నప్పటి నుంచి కుటుంబం కోసం ఎంతో కష్టపడ్డాడు. పగటిపూట బస్సు నడుపుతూ, ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూనే, రాత్రి పూట ఫుట్‌బాల్ శిక్షణ తీసుకునేవాడు. ఎలాంటి లగ్జరీ అకాడమీలు, సూపర్‌స్టార్ కాంట్రాక్టులు లేకపోయినా, కేవలం కఠిన శ్రమ, త్యాగం, ఆత్మవిశ్వాసంతో తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో పోర్చుగల్, అంగోలా, మోల్డోవా, సైప్రస్ వంటి వివిధ దేశాల క్లబ్‌లలో ఆడాడు. 2026 వరల్డ్ కప్‌లో తొలిసారిగా అడుగుపెట్టిన కేప్ వెర్డ్ దేశానికి ఇది ఒక గొప్ప మైలురాయి. మ్యాచ్ ముగిసిన తర్వాత తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్న వోజిన్హా.. తన లేట్ గ్రాండ్‌పేరెంట్స్‌కు మరియు వీసా సమస్యల వల్ల ఈ చారిత్రాత్మక మ్యాచ్‌ను చూడటానికి రాలేకపోయిన తన తల్లికి ఈ విజయాన్ని అంకితం చేస్తున్నట్లు ప్రకటించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో వోజిన్హా రాత్రికి రాత్రే గ్లోబల్ స్టార్ అయ్యాడు. మ్యాచ్‌కు ముందు కేవలం 50 వేల ఫాలోవర్లు మాత్రమే ఉన్న అతని ఇన్‌స్టాగ్రామ్ ఖాతా, ఇప్పుడు ఏకంగా కోట్ల సంఖ్యకు చేరింది. "వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే.. అంకితభావం ఉంటే ఏదైనా సాధ్యం" అని ఈ 40 ఏళ్ల హీరో నిరూపించాడు. "మీరు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం మీ అంతిమ గమ్యాన్ని లేదా మీ భవిష్యత్తును నిర్వచించలేదు. కష్టపడటం ఆపకండి, ప్రయత్నాన్ని కొనసాగించండి. కలలు కనడానికి, వాటిని నిజం చేసుకోవడానికి ఎలాంటి గడువు లేదు."

# 19న మదనపల్లెలో ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ వ్యతిరేక నిరసన ప్రదర్శన: మాలమహానాడు పిలుపు

మదనపల్లె (రాజనీతి), జూన్ 17: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని మరియు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో 'క్రిమిలేయర్' విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19వ తేదీ (శుక్రవారం) మదనపల్లె పట్టణంలో భారీ శాంతియుత నిరసన ప్రదర్శనను చేపట్టనున్నట్లు మాలమహానాడు ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గుండా మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19.06.2026 ఉదయం 9:00 గంటలకు మదనపల్లెలోని నమ్మనపల్లి (నిమనపల్లి) సర్కిల్ వద్ద గల మాలమహానాడు కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలని కోరారు. అక్కడ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఈ శాంతియుత నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ నిరసన కార్యక్రమానికి మాలమహానాడు రాష్ట్ర నాయకులు, రాయలసీమ ప్రాంతీయ నాయకులు, ఉమ్మడి జిల్లా మరియు మండల స్థాయి నాయకులతో పాటు వివిధ మాల సంఘాల ప్రతినిధులు, దళిత మేధావులు, మాల విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల పరిరక్షణకై చేపట్టే ఈ పోరాటంలో పాల్గొనే వారందరూ తప్పనిసరిగా నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల దుస్తులు ధరించి హాజరుకావాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వచ్చి ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుండా మనోహర్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ మంత్రి బాలినేనికి మరో పదవి.. కీలక బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్



రాజనీతి: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టారు. రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు మిగిలిన రాజకీయ పార్టీల నుంచి నేతల్ని, విద్యా వంతులు, సామాజికవేత్తలు, తటస్థుల్ని పార్టీలోకి ఆహ్వానించాలని భావిస్తున్నారు. జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించారు పవన్ కళ్యాణ్. మొత్తం14 మంది సభ్యులతో ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ఏర్పాటు చేయగా.. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే బాలినేనిని ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి.. స్థానిక సంస్థల ఎన్నికలు, డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియ బాధ్యతలు అప్పగించారు. తాజాగా పార్టీలో చేరికలకు సంబంధించిన కమిటీలో నియమించారు. జనసేన పార్టీ జాయినింగ్స్ కమిటీలో మొత్తం 14 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి జనసేన పార్టీలో చేరికల్ని సమన్వయం చేస్తారు. జనసేన పార్టీ నియమించిన కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంపీ లింగమనేని రమేష్‌లు ఉన్నారు. అలాగే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభానులను నియమించారు. జనసేన పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా. హరిప్రసాద్, డా. పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టి సి వరుణ్, ఆరణి మదన్‌లను కూడా కమిటీలో నియమించారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను దిగ్విజయం చేయండి

- పార్టీలకు అతీతంగా ప్రజలు తరలిరావాలి
- తెలుగుదేశం సీనియర్ నేత ఆర్.జె వెంకటేష్ పిలుపు

రాజనీతి: ఈనెల 20వ తేదీ న అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటిస్తారని టిడిపి సీనియర్ నాయకులు ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు.బుధవారం నిమ్మనపల్లి కూడలిలో గల టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మదనపల్లె జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చి,ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు నాయుడు దశాబ్దాల కల అయిన మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించి ఇక్కడ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజనలో మదనపల్లికి చోటు కల్పించకపోవడంతో తెలుగుదేశం పార్టీతోపాటు వామపక్షాలు,ఇతర పార్టీలు మదనపల్లి జిల్లా కోసం ఉద్యమించాయని గుర్తుచేశారు.అయితే జిల్లా కేంద్రంగా మదనపల్లి ఏర్పాటైనప్పటికీ కొన్ని సమస్యలు అలాగే మిగిలిపోయాయన్నారు.ముఖ్యంగా మదనపల్లి పట్టణంలో రోడ్ల విస్తరణ,మదనపల్లి నుండి రామసముద్రం,నిమ్మనపల్లెలకు డబుల్ రోడ్డు నిర్మాణం,చారిత్రాత్మక బీటీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించడం,మధ్యలో ఆగిపోయిన మెడికల్ కళాశాల పనులను తిరిగి ప్రారంభించడం,బహుదా ప్రాజెక్టును నీటితో నింపడం,హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని అన్నిచెరువులను పూర్తిస్థాయిలో నింపడం వంటి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ద్వారా వాటిని పరిష్కరించుకోవాల్సిన ఆవశ్యత ఎంతైనా ఉందన్నారు.అదేవిధంగా చీకలబైలు వద్ద జలధార కార్యక్రమానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేస్తారని,అనంతరం అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సభకు కూటమి నాయకులు,కార్యకర్తలు,నియోజకవర్గంలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రం హామీ నెరవేర్చిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి మదనపల్లికి విచ్చేస్తున్నారని కావున ఆయనకు కనివినీ ఎరుగని రీతిలో స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులు,ప్రజలను ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గండికోట గణేష్,శ్రీనాథ్,భరత్,విద్యా సాగర్,దేవకి తదితరులు పాల్గొన్నారు.

## 19న పీలేరులో 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్'


## విజయోత్సవ సమావేశం: ఎమ్మెల్యే కార్యాలయం పిలుపు

**-ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**

**-కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనాలని ఆహ్వానం**


పీలేరు (రాజనీతి), జూన్ 17: పీలేరు నియోజకవర్గ పరిధిలో ఈ నెల 19వ తేదీ (శుక్రవారం) ఉదయం 9:30 గంటలకు "సూపర్ సిక్స్ - సూపర్ హిట్" -- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సమావేశాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పీలేరు పట్టణంలోని స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఈ నియోజకవర్గ స్థాయి ముఖ్యమైన సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్లు మరియు డైరెక్టర్లు, ఏఎంసీ (మార్కెట్ యార్డ్) చైర్మన్లు మరియు డైరెక్టర్లు, క్లస్టర్ ఇంచార్జీలు హాజరుకానున్నారు. అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పార్టీల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, గ్రామ మరియు పట్టణ కమిటీల అధ్యక్షులు, కేఎస్ఎస్ (ఖూూ) సభ్యులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు మరియు నల్లారి అభిమానులు అందరూ ఈ విజయోత్సవ సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఆత్మీయంగా ఆహ్వానించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తిరుమల (రాజనీతి), జూన్ 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) డాక్టర్ శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమలకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారి కుటుంబానికి వేదాశీర్వచనం పలికి, స్వామివారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. నియోజకవర్గ ప్రజలు, అభిమానులు 'పెద్దాయన' అని ఆప్యాయంగా పిలుచుకునే పెద్దిరెడ్డి గారు ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. స్వామివారి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ దర్శనంలో ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## పెద్ద ఉప్పరపల్లి పీహెచ్సీ పరిధిలో కేసీడీ సర్వే పరిశీలన



పెద్ద ఉప్పరపల్లి (రాజనీతి), జూన్ 17: పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) పరిధిలోని నాగెల్లవారిపల్లి గ్రామంలో బుధవారం లాంచనంగా కొనసాగుతున్న కేసీడీ సర్వే పనులను మల్టీ పర్పస్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంపీహెచ్ఈఓ) క్షేత్రస్థాయిలో పరిశీలించి మానిటరింగ్ చేశారు. గ్రామంలోని వీధుల్లో పర్యటించి ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రజల నుండి సేకరిస్తున్న వివరాల నమోదు ప్రక్రియను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇల్లాలు, గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లల ఆరోగ్య సమాచారాన్ని పక్కాగా ఆన్‌లైన్ రికార్డులలో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను మరింత వేగంగా చేరువ చేయడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సబ్‌సెంటర్ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 19న జరుగు ధర్నాను జయప్రదం చేయండి: మాలమహానాడు



పీలేరు (రాజనీతి), జూన్ 17: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని మరియు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో 'క్రిమిలేయర్' విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నెల జూన్ 19న మాలమహానాడు ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే నల్లజెండాల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ పిలుపునిచ్చారు. పీలేరు మండలం బాలంవారిపల్లి పంచాయతీ పరిధిలోని నాలెవాండ్లపల్లి నందు మాలమహానాడు మండల ప్రచార కార్యదర్శి అర్వింటి రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుల పేరుతో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ వల్ల దళిత ఐక్యతకు భంగం వాటిల్లుతుందని, అలాగే క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రజావ్యతిరేక అంశాలపై వెంటనే పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 19న మదనపల్లె జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మాలమహానాడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నల్లజెండాలతో నిరసన ప్రదర్శన, ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు, మాల మేధావులు, మాల విద్యార్థి సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పు ఆనంద్, మంచూరి క్రిష్ణయ్య, సిద్దయ్య, చిన్నక్క, రుక్మిణి, అలివేలు మరియు స్థానిక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రేపు 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం' విజయోత్సవ సభ: మినిట్ టు మినిట్ షెడ్యూల్ విడుదల

**-ఆర్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ఏర్పాట్లు**

**-హాజరుకానున్న జిల్లా కలెక్టర్, మంత్రులు, శాసనసభ్యులు**

మదనపల్లె జూన్ 17 రాజనీతి: మదనపల్లె నగరంలోని ఆర్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వేదికగా ఈ నెల 18వ తేదీ (గురువారం) నిర్వహించనున్న "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" విజయోత్సవ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక 'మినిట్ టు మినిట్' (నిమిషాల వారీ) షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు సాగే ఈ కార్యక్రమం యొక్క పూర్తి వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ఉదయం 10:00 నుండి 10:30: ముఖ్య అతిథుల స్వాగత వేడుక
ఉదయం 10:30 నుండి 10:35: జ్యోతి ప్రజ్వలన
ఉదయం 10:35 నుండి 10:45: జ్యోతి పూజలు
ఉదయం 10:45 నుండి 10:50: ప్రార్థన
ఉదయం 10:45 నుండి 11:00:
గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారి ప్రారంభ ఉపన్యాసం
ఉదయం 11:00 నుండి 11:10: జిల్లా స్థాయి అధికారుల ఉపన్యాసం (టీడీపీ)
ఉదయం 11:10 నుండి 11:20: జిల్లా స్థాయి అధికారియోం ఉపన్యాసం (బీజేపీ)
ఉదయం 11:20 నుండి 11:30: జిల్లా స్థాయి అధికారుల ఉపన్యాసం (జనసేన)
ఉదయం 11:30 నుండి 11:45: గౌరవనీయులైన కడప మనస్సాక్షి ఎమ్మెల్యే గారి ఉపన్యాసం
ఉదయం 11:45 నుండి మధ్యాహ్నం 12:00:
గౌరవనీయులైన పీలేరు ఎమ్మెల్యే గారి ఉపన్యాసం
మధ్యాహ్నం 12:00 నుండి 12:00: ప్రభుత్వం ద్వారా
లబ్ధిపొందిన లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం
మధ్యాహ్నం 12:00 నుండి 12:20:
గౌరవనీయులైన రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రివర్యుల ఉపన్యాసం
మధ్యాహ్నం 12:20 నుండి 12:40: గౌరవనీయులైన జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యుల ముఖ్య ఉపన్యాసం
మధ్యాహ్నం 12:40 నుండి 12:45: వందన సమర్పణతో కార్యక్రమ ముగింపు...

ప్రభుత్వం గత రెండేళ్లుగా చేపట్టిన వివిధ రకాల ప్రజా సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ సమావేశం కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

## నీళ్ల విరోచనాలకు ఓఆర్ఎస్ సంజీవని: డిప్యూటీ హెచ్ఈఓ మహమ్మద్ రఫీ



వాయల్పాడు (రాజనీతి), జూన్ 17: నీళ్ల విరోచనాలను (డయేరియా) నియంత్రించడంలో ఓఆర్ఎస్ పొడి ఒక సంజీవనిలా పనిచేస్తుందని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డిప్యూటీ హెచ్ఈఓ) మహమ్మద్ రఫీ అన్నారు. 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'లో భాగంగా బుధవారం వాయల్పాడు మండలం గండబోయినపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా టీకాల కొరకు చిన్నారులతో హాజరైన తల్లులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల ప్రాముఖ్యత మరియు వాటిని ఉపయోగించే విధానంపై ప్రత్యేక అవగాహన కల్పించి, వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్ఈఓ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. జూన్ 16 నుండి జూలై 31 వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమం విస్తృతంగా నిర్వహించబడుతుందని తెలిపారు. నీళ్ల విరోచనాల వల్ల ఐదు సంవత్సరాల లోపు పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా చూడటం మరియు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తుగా నియంత్రించడమే ఈ క్యాంపెయిన్ యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. నీళ్ల విరోచనాలు అనేవి ప్రధానంగా ఒక వైరస్ వల్ల వస్తాయని, రోజుకు 4 లేదా 5 సార్లు పలుచగా విరోచనాలు అయితే దానిని డయేరియాగా గుర్తించాలని పేర్కొన్నారు. డయేరియా బారిన పడకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను ఉపయోగించాలని, చేతుల శుభ్రత (హ్యాండ్ వాష్) తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఆరు నెలల లోపు చిన్నారులకు తల్లిపాలు తప్ప వేరే ఏమీ ఇవ్వరాదని, తాగునీటిని కాచి చల్లార్చి మాత్రమే తాగించాలని సూచించారు. నిల్వ ఉంచిన చద్ది ఆహారం తినకుండా, తాజాగా వండుకున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఆహార పదార్థాలపై ఎల్లప్పుడూ మూతలు ఉంచడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తల్లులకు విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎమ్ఎల్హెచ్‌పీ (మీూూ) మౌనిక, ఏఎన్ఎమ్ (ూచీవీ) రాణి, ఆశా కార్యకర్త నీలావతి, చిన్నారుల తల్లులు మరియు ఆరోగ్య శాఖ సహాయకులు పాల్గొన్నారు.




Printed, Published & Owned by Smt.kakarla padmaja, Published at Do.No.3-267/5, Ragavendra Colony, Greemspeta, Chittoor Dist, Ap. and Printed at Prajasakthi Press, Renigunta road, Tirupati, Chittoor, A.P. Editor : N.Nagaraju, RNI No. APTEL/2013/49614